జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 168 4-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



## అప్పుల లెక్కల్లో పొంతన లేదు..

మంత్రి చెప్పింది ఒకటి.. సీఎం చెప్పింది మరొకటి

- రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందన్న హరీశ్ రావు
- సంగారెడ్డిలో జరిగిన అవగాహన సదస్సులో ప్రభుత్వ తీరుపై విమర్శలు
- మంత్రి జూపల్లి లేఖ ప్రకారం అప్పు రూ.1.77 లక్షల కోట్లు అని వెల్లడి
- అసెంబ్లీలో సీఎం చెప్పిన అప్పు రూ.3.45 లక్షల కోట్లు అని గుర్తు చేసిన మాజీ మంత్రి
- ప్రభుత్వ పెద్దల లెక్కల్లోనే తేడాలు ఉన్నాయని ఆరోపణ

# బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?

- అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ భారం తగ్గించిందన్న డిప్యూటీ సీఎం
- సింగరేణిని బీఆర్ఎస్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శ



తెలంగాణ అప్పులపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటు ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో భారీ అప్పులు చేశారని అన్నారు. అప్పులపై కేసీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, ఆర్థిక వ్యవహారాలపై వివరాలు వెల్లడించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భట్టి తెలిపారు. ఇందులో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు కూడా ఉన్నాయని చెప్పారు. పదేళ్ల పాలన అబద్ధాల పునాదులపై సాగిందని విమర్శించారు. ఈ భారీ అప్పులపై మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అప్పుల కారణంగా రెండున్నరేళ్లలో అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని భట్టి చెప్పారు.

- మిగతా 2వ పేజీలో

## జూలై 9న మషద్‌లో జరగనున్న ఖననం

- అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఖమేనీ
- నాలుగు నెలల తర్వాత ప్రారంభమైన అంత్యక్రియలు
- ఇంతకాలం కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరిచిన భౌతికకాయం
- వివిధ నగరాల్లో భారీ స్థాయిలో తుది వీడ్కోలు ఏర్పాట్లు




## దేశంలోనే తొలిసారిగా విమానాన్ని ఈ-వేలం.!

- ఫాల్కన్ స్కామ్‌లో ఈడీ కీలక ముందడుగు
- హాకర్ 800ఎక్స్‌పీ విమానం రూ.3 కోట్లకు ఈ-వేలం
- బాధితులకు విక్రయ నగదు పంపిణీకి నిర్ణయం
- రూ.792 కోట్ల పోంజీ స్కామ్‌పై దర్యాప్తు కొనసాగుతోంది




## పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం.. 40 మంది మృతి..

- పాకిస్థాన్‌లో లోయలో పడిపోయిన ప్రయాణికుల బస్సు ప్రమాదంలో కనీసం 40 మంది మృతి, 8 మందికి గాయాలు
- బ్రేకులు ఫెయిల్ కావడం, అధిక ప్రయాణికులే కారణం!
- బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా సరిహద్దుల్లో ఘటన

# గూగుల్ కంటే ఇవే ఎక్కువ సంతోషం కలిగించాయి

- గూగుల్ కంటే కుప్పం ప్రాజెక్టులే ఎక్కువ సంతోషాన్నిచ్చాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- కుప్పంలో రూ.9,322 కోట్ల విలువైన 27 పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన
- అడిడాస్ షూస్, విమానాల తయారీ వంటి కీలక కంపెనీలతో వేల ఉద్యోగాలకు అవకాశం
- శంకుస్థాపన రోజే ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించిన పారిశ్రామికవేత్తలు
- దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి హామీ



"గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన చేసిన నాటి కంటే, ఇవాళ జరిగిన కార్యక్రమాలతోనే నాకు ఎక్కువ సంతోషంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం రూపురేఖలను మార్చే భారీ పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గుడుపల్లె మండలం పొగురుపల్లిలో "స్వర్ణ కుప్పం.. పెట్టుబడుల వేదిక" పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే పలు కీలక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పం, ఇప్పుడు అభివృద్ధి కేంద్రంగా

- మిగతా 2వ పేజీలో

## లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా..

- మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?
- తెలంగాణ అప్పులపై చర్చకు తాను సిద్ధమన్న జూపల్లి
- సాయంత్రం 5 గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తానన్న మంత్రి
- పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందామని సవాల్







## ప్రశ్నిస్తే చంపేస్తారా? జనసైనికులపై ప్రకాశ్ రాజ్ ఫైర్

- యూట్యూబర్ అరెస్ట్‌పై ప్రకాశ్ రాజ్ ఆగ్రహం
- జనసేన తీరుపై తీవ్ర వ్యాఖ్యలు
- జనసేన కార్యకర్తలు గుండాల్లా ప్రవర్తిస్తున్నారంటూ తీవ్ర విమర్శలు
- వారిపై చర్యలు తీసుకోవాలని పవన్, చంద్రబాబులను ట్యాగ్ చేసిన నటుడు
- యూట్యూబర్ ప్రశ్న రావణ్ అరెస్ట్ వ్యవహారంపై వీడియో విడుదల

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో సీమ దశ మారిపోతుంది

- సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్ పనులకు చంద్రబాబు శ్రీకారం
- సీమ దశాబ్దాల కలను నిజం చేస్తూ చారిత్రాత్మక అడుగు వేశామని వ్యాఖ్య
- ఈ ప్రాజెక్టుతో స్థానిక యువతకు వేలాది ఉద్యోగాలు లభిస్తాయని ధీమా
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీని ప్రగతి పథంలో నిలుపుతామన్న లోకేశ్



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## దేశంలోనే తొలిసారిగా విమానాన్ని ఈ-వేలం.!

ఫాల్కన్ పోంజీ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (జుణ) కీలక పురోగతి సాధించింది. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఈడీ అధికారులు తాము సీజ్ చేసిన ఒక విమానాన్ని ఈ-వేలం (జు-ూాబఆఙఅశీఅ) ద్వారా విజయవంతంగా విక్రయించారు. హైదరాబాద్ జోనల్ ఈడీ పరిధిలో జరిగిన ఈ వేలం ప్రక్రియ దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**రూ. 3 కోట్లకు హాకర్ 800ఙూ విమానం విక్రయం**

ఫాల్కన్ స్కామ్‌లో భాగంగా ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్న 'హాకర్ 800ఙూ' (ఝఝనవతీ 800ఙూ) చార్టర్డ్ విమానాన్ని ఈ-వేలంలో రూ. 3 కోట్లకు విక్రయించారు. అయితే ఈ ప్రైవేట్ విమానం ధర రూ.14 కోట్ల వరకూ ఉంటుందని సమాచారం. అయితే.. జూలై 1న ఎంఎస్‌టీసీ (వీూజ) సంస్థ ద్వారా ఈడీ ఈ ఆక్షన్ ప్రక్రియను నిర్వహించింది. పీఎంఎల్‌ఏ (ూవీూూ) అడ్జుడికేటింగ్ అథారిటీ ముందస్తు అనుమతితోనే అధికారులు ఈ విమానాన్ని వేలానికి ఉంచారు. కాగా, ఈ విక్రయం ద్వారా వచ్చిన రూ. 3 కోట్ల మొత్తాన్ని ఈ స్కామ్‌లో నష్టపోయిన బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నట్లు ఈడీ స్పష్టం చేసింది.

**శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సీజ్**

ఫాల్కన్ పోంజీ కేసులో ప్రధాన నిందితుడైన అమర్‌దీప్ కుమార్‌కు ఈ చార్టర్డ్ విమానం చెందుతుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా 2025 మార్చి 7న శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (=+×ూ)లో ఈడీ అధికారులు దీనిని అటాచ్ చేసి, స్వాధీనం చేసుకున్నారు.

**రూ. 792 కోట్ల భారీ మోసం**

నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ (ఖీఝనవ ×అజశీఱవ ణఱంఙశీబఞఱఅస్త్ర) పేరుతో నిందితులు భారీ మోసానికి తెరలేపారు. అమర్‌దీప్ కుమార్ అండ్ గ్యాంగ్ దాదాపు రూ. 792 కోట్ల మేర బాధితులను నమ్మించి, పెట్టుబడుల పేరుతో మోసం చేసినట్లు ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. ఈ భారీ స్కామ్‌కు సంబంధించి ఈడీ అధికారులు ఇప్పటికే ముగ్గురు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరిన్ని ఆస్తుల గుర్తింపు, నిధుల మళ్లింపుపై ప్రస్తుతం లోతైన దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ వర్గాలు వెల్లడించాయి.

## అప్పుల లెక్కల్లో పొంతన లేదు..

రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన 'ఎస్ఐఆర్'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా తనకు లేఖ రాశారని తెలిపారు. అయితే, ఇదే అంశంపై నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం చేసిన అప్పు రూ. 3,45,294 కోట్లు అని చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఒకే ప్రభుత్వంలోని మంత్రి ఒక లెక్క, ముఖ్యమంత్రి మరో లెక్క చెప్పడం గందరగోళానికి దారితీస్తోందని హరీశ్ రావు అన్నారు. అప్పుల విషయంలో ప్రభుత్వ పెద్దలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ లెక్కల్లో ఏది నిజమో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా..

తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. "తెలంగాణ అప్పులపై చర్చకు నేను సిద్ధం. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు సాయంత్రం 5 గంటలకు వస్తా. మరి బీఆర్ఎస్ నేతలు సిద్ధమేనా?" అంటూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. "ఖబడ్దార్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందాం రండి" అని ధ్వజమెత్తారు. తన లెక్కలు తప్పు అయితే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు తక్షణమే రాజీనామా చేస్తానని, మరి వారి లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్పే లెక్కలు నిజమేనని మీడియా ముందు ఒప్పుకోవాలని అన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర అప్పులపై కేటీఆర్, హరీశ్‌రావు ఒక్కొక్కరు ఒక్కో రకమైన అబద్ధపు లెక్కలు చెప్పారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంపై ఏకంగా రూ.8,21,651 కోట్ల అప్పుల భారం మోపారని ఆయన మండిపడ్డారు. కార్పొరేషన్ల ద్వారా దొంగచాటుగా తెచ్చిన అప్పులను వీరు ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. తాను ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, వ్యాపారాలు చేసుకుని రాజకీయాల్లోకి వచ్చానని.. పారిపోయే లక్షణం తనకు లేదని, అబద్ధాలు చెప్పే అలవాటు అంతకన్నా లేదని స్పష్టం చేశారు.

## ప్రశ్నిస్తే చంపేస్తారా?
## జనసైనికులపై ప్రకాశ్ రాజ్ ఫైర్

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, జనసేన పార్టీ కార్యకర్తల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. యూట్యూబర్ ప్రశాంత్ రావణ్ అరెస్టు వ్యవహారంలో జనసైనికులు వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ, "ప్రశ్నించేవాళ్లను చంపేస్తారా ఏంటి? ఇది గుండాయిజం కాదా?" అని నిలదీశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక వీడియో విడుదల చేశారు. జనసేన కార్యకర్తల తీరు రౌడీయిజంలా ఉందని, దీనిపై చర్యలు తీసుకుంటారా? అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను ట్యాగ్ చేస్తూ ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో జనసేన కార్యకర్తలు అతిగా ప్రవర్తిస్తున్నారని, పద్ధతిగా మెలగాలని ప్రకాశ్ రాజ్ హితవు పలికారు. కేసును న్యాయస్థానం చూసుకుంటుందని, దేశం మొత్తం ఈ పరిణామాలను గమనిస్తోందని ఆయన హెచ్చరించారు. పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో యూట్యూబర్ జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌ను ఏపీ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అరెస్టు అనంతరం ఆయన్ను పిఠాపురానికి తరలించగా, అక్కడ ఒక కేసులో బెయిల్ లభించింది. అయితే, జనసేన కార్యకర్తలు పెట్టిన మరో కేసులో పోలీసులు ఆయన్ను వెంటనే తిరిగి అరెస్టు చేశారు. ఈ క్రమంలో ప్రశాంత్‌ను మచిలీపట్నం తరలించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలోనే జనసేన కార్యకర్తల తీరును విమర్శిస్తూ ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.

# గూగుల్ కంటే ఇవే ఎక్కువ సంతోషం కలిగించాయి

(మొదటి పేజీ తరువాయి)

మారుతోందని చంద్రబాబు అన్నారు. మొత్తం రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 27 పరిశ్రమలు కుప్పంలో కొలువుదీరనున్నాయని ప్రకటించారు. ఫుట్‌వేర్ నుంచి విమానాల తయారీ వరకు వివిధ రంగాలకు చెందిన ప్రఖ్యాత కంపెనీలు తమ యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ అడిడాస్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌కు సీఎం భూమిపూజ చేశారు. హ్వాసెంగ్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.899 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమ ద్వారా ఏకంగా 20,145 మందికి ఉపాధి లభించనుంది. దేశంలోనే తొలి బ్యాటరీ అనోడ్ మెటీరియల్ ప్లాంట్‌కు కుప్పంలో శ్రీకారం చుట్టారు. అథా గ్రూప్ రూ.2,081 కోట్ల భారీ పెట్టుబడితో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, దీని ద్వారా 2,600 మందికి ఉద్యోగాలు రానున్నాయి. వియేషన్ రంగంలోనూ కుప్పం తనదైన ముద్ర వేయనుంది. పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడితో టూ సీటర్ ట్రైనర్ విమానాల తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. దీనివల్ల 1,400 మందికి ఉపాధి దొరుకుతుంది. వీటితో పాటు ఎంఏఎఫ్ క్లోతింగ్ (గార్మెంట్స్), న్యూట్రి ఫీడ్స్ (చికెన్ ప్రాసెసింగ్), ఫామ్ అమినో అగ్రిటెక్ (కర్కుమిన్ ఎక్స్‌ట్రాక్షన్) వంటి అనేక ఇతర పరిశ్రమల నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.



ఈ సందర్భంగా పరిశ్రమలకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అద్భుతంగా ఉందని పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. ప్రభుత్వ ప్రోత్సాహం చూశాక, పనులను మరింత వేగంగా పూర్తి చేయాలనే ఉత్సాహం కలుగుతోందని తెలిపారు. శంకుస్థాపన రోజే ప్రారంభోత్సవ తేదీలను నిర్దేశించుకుని పనిచేయాలని పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించగా, వారు వేదికపై నుంచే తమ ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించడం విశేషం. అనంతరం ఆయా కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం, వారి ఉత్పత్తులు, పనితీరు గురించి ఆరా తీశారు. ఈ సభలో ప్రసంగించిన చంద్రబాబు, కుప్పం ప్రజలు తనను 8వ సారి ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి దీవెనలే తనకు శ్రీరామరక్ష అని అన్నారు. "నేను ఎక్కడున్నా నా ఆలోచనలు కుప్పం మీదే ఉంటాయి. దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేయాలన్నది నా కోరిక. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి, అందులో కుప్పం ముందుండాలి," అని ఆయన ఆకాంక్షించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన యువతను అందించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధిని అడ్డుకునే వారి తోకలు కత్తిరిస్తానని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలతో పాటు, ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం, బీసీ, ఓసీ కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టు, పరిశ్రమల కోసం విద్యుత్ సబ్‌స్టేషన్లు, హెరిటేజ్ గ్రానైట్ స్టోన్ క్లస్టర్ వంటి పలు అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

## జూలై 9న మషద్‌లో జరగనున్న ఖననం

ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ మరణించిన నాలుగు నెలల తర్వాత ఆయన అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభమైంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఫిబ్రవరి 28న ఆయన కన్నుమూయగా, భద్రతా కారణాల దృష్ట్యా ఇప్పటి వరకు పార్థివ దేహాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరిచారు. తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడంతో, వారం రోజుల పాటు సాగే ఈ అంతిమ యాత్ర కోసం ఇరాన్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. జూలై 9న ఆయన స్వస్థలమైన మషద్‌లో ఖననం నిర్వహించనున్నారు. ఖమేనీ శవపేటిక శుక్రవారం నాటికి టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా ప్రార్థనా సముదాయానికి చేరుకుంది. మూడు రోజుల పాటు ఇక్కడ ప్రజలు, ఉన్నతాధికారులు, సైనిక సిబ్బంది మరియు విదేశీ ప్రతినిధుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచుతారు. ఆ తర్వాత పవిత్ర నగరం ఖోమ్‌లోనూ, ఇరాక్‌లోని నజాఫ్, కర్బలాల్లోనూ సంతాప కార్యక్రమాలు నిర్వహించి, చివరగా జూలై 9న మషద్‌లోని ఇమామ్ రెజా పుణ్యక్షేత్రంలో అంత్యక్రియలు పూర్తి చేస్తారు. ఈ కార్యక్రమాల్లో కోట్లాది మంది పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇస్లామిక్ సంప్రదాయాల ప్రకారం మరణించిన వారి శవాన్ని 24 గంటలలోపే ఖననం చేయాలి, అలాగే రసాయనాలతో ఎంబామింగ్ చేయడం కూడా నిషేధం. అయితే, ప్రస్తుత యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ అధినేత ఖమేనీ మృతదేహం విషయంలో మినహాయింపు తీసుకున్నారు. ఆయన పార్థివదేహాన్ని, ఆయన కుటుంబ సభ్యుల మృతదేహాలతో పాటు ఫోరెన్సిక్ మార్చురీలోని రిఫ్రిజిరేటెడ్ కోల్డ్ స్టోరేజ్‌లో (ఫ్రీజింగ్) భద్రపరిచారు. యుద్ధం వంటి అత్యవసర సమయాల్లో ఖననం ఆలస్యం కావడానికి షియా ధార్మిక నియమాల్లో ప్రత్యేక మినహాయింపు ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ అంతిమ యాత్ర ద్వారా దేశ ఐక్యతను, శక్తిని ప్రపంచానికి చాటిచెప్పాలని ఇరాన్ భావిస్తోంది. ప్రజలు ఈ యాత్రలో పెద్దఎత్తున తరలిరావాలని అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ పిలుపునిచ్చారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, చైనా, భారత్ సహా పలు దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా ఖమేనీ వారసుడిగా నియమితులైన నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండే అవకాశం ఉంది.

## బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?

అయినప్పటికీ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. అధిక వడ్డీ అప్పులను రీస్ట్రక్చరింగ్ చేయడం వల్ల వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సింగరేణిని సంక్షోభంలోకి నెట్టిందని భట్టి ఆరోపించారు. కొత్త కోల్ బ్లాకులు తీసుకురాలేదని విమర్శించారు. బొగ్గు మాయం ఆరోపణలపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కొత్త కోల్ బ్లాకుల కోసం కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో సీమ దశ మారిపోతుంది

రాయలసీమ ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో మరో చారిత్రాత్మక అడుగు పడిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేశామని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ రూపురేఖలు మారనున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో విజయనగరంలో జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కు పనులను కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద 2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్, 350 మెగావాట్ల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ప్లాంట్ పనులకు ఇవాళ సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టడం తెలిసిందే. దీనిపై లోకేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాయలసీమ ప్రాంతం ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నిలపాలన్న కూటమి ప్రజా ప్రభుత్వ ఉక్కు సంకల్పానికి ఈ స్టీల్ ప్లాంట్ నిదర్శనమని లోకేశ్ అభివర్ణించారు.

## పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం.. 40 మంది మృతి..

పాకిస్థాన్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళుతున్న బస్సు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోవడంతో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుల సరిహద్దులోని షెరనీ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ ప్రయాణికుల బస్సు, దానా సర్ ప్రాంతంలోని పర్వత రహదారిపై ప్రయాణిస్తుండగా ఉదయం 8 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. బస్సులో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం, బ్రేకులు విఫలం కావడం వల్లే ఈ ఘోరం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదకరమైన మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు ఒక్కసారిగా లోయలోకి దూసుకెళ్లింది. ప్రారంభంలో ఈ బస్సు 36 మంది ప్రయాణికులతో బయలుదేరినప్పటికీ, మార్గమధ్యంలో మొరాయించిన మరో వాహనంలోని ప్రయాణికులను కూడా ఎక్కించుకోవడంతో మొత్తం ప్రయాణికుల సంఖ్య 48కి చేరింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే '1122' అత్యవసర సిబ్బంది, స్థానిక అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# అమరావతి పేరుతో చేస్తున్న అప్పుల భారం చివరకు ప్రజలపైనే పడుతుంది: సజ్జల

రాజధాని అమరావతి అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం భారీ అప్పులు చేస్తోందని... ఈ భారం చివరికి రాష్ట్ర ప్రజల నెత్తినే పడబోతోందని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ధనంతో చేపట్టే ప్రతి ప్రాజెక్టుపై పారదర్శకత ఉండాలని అన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ప్రధాన ప్రతిపక్షంగా తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు తిరిగి ఇవ్వాల్సిన ప్లాట్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా... ప్రభుత్వం మాత్రం రైతులను చివరి ప్రాధాన్యతగా చూస్తోందని ఆరోపించారు. అమరావతిలో ఒక్క చదరపు అడుగు నిర్మాణానికి ఏకంగా రూ.20 వేల వరకు ఖర్చు చేస్తున్నారని... దీనిపై తాము సందేహాలు వ్యక్తం చేస్తే అధికార పక్షం సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.47 వేల కోట్ల వరకు అప్పులు తీసుకువచ్చిందని సజ్జల వెల్లడించారు. అంత



భారీ నిధులను రాజధాని హంగులకే తగలేయకుండా... మచిలీపట్నం పోర్టు, కొత్త మెడికల్ కళాశాలలు, హంద్రీ-నీవా సుజల స్రవంతి, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి కీలక పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం చేకూరేదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయిందని... ఇలాంటి తరుణంలో రాజధాని కోసం మరో రూ.2 లక్షల కోట్ల అదనపు భారం మోపితే సామాన్యుడి పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో 40 శాతం మంది ప్రజలు ఓటు వేసిన బలమైన పార్టీగా వైసీపీ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తూనే ఉంటుందని చెప్పారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా లింగాల నర్సిరెడ్డి

- నియామక ఉత్తర్వులు జారీ చేసిన టీపీసీసీ
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: నర్సిరెడ్డి



**తొలివెలుగు, అడ్డగూడూరు :** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా డి.రాపాక గ్రామానికి చెందిన లింగాల నర్సిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లింగాల నర్సిరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల పార్టీ బాధ్యతలను అప్పగించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రులకు, తుంగతుర్తి శాసనసభ్యుడు మందుల సామెల్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్యకు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు నివేదించారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం శ్రమిస్తానని నర్సిరెడ్డి స్పష్టం చేశారు.

# ఆర్టీసీ బస్సు పునరుద్ధరించకుంటే 'ఆర్‌ఎం' కార్యాలయం ముట్టడి

- రామన్నపేట - అమ్మనబోలు రూట్లో విద్యార్థుల ఇబ్బందులు
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట – అమ్మనబోలు రూట్లో ఆర్టీసీ బస్సు సర్వీసును తక్షణమే పునరుద్ధరించి విద్యార్థుల రవాణా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో నల్లగొండ రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ఈ రూట్లో ఆర్టీసీ బస్సు నడవకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రూట్ పరిధిలోని తొమ్మిది గ్రామాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు మండల కేంద్రంలోని వివిధ విద్యాసంస్థల్లో చదువుకుంటున్నారని, రవాణా సౌకర్యం లేక వారి చదువులకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రతిరోజూ ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణిస్తూ ఒక్కో విద్యార్థి రూ.100 వరకు ఖర్చు భరించాల్సి వస్తోందని, ఇది పేద కుటుంబాలపై అదనపు భారమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, నాయకులు టి. లోకేష్ యాదవ్, ఎం. ప్రవీణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మాపురంలో వైభవంగా గంగదేవమ్మ పండుగ

- అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం
- గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థన

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో శ్రీ గంగదేవమ్మ తల్లి పండుగ మహోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేముల వీరేశం అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, గ్రామాలు శాంతి సౌభాగ్యాలతో విరాజిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా ఇలాంటి సంప్రదాయ పండుగలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# లక్ష్య సాధనలో నైతికత ముఖ్యం

- క్లినికల్ ఫార్మసీ, పరిశోధన రంగాల్లో అపార అవకాశాలు
- జేఎన్టీయూహెచ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సునీతారెడ్డి
- ఘనంగా కె.వి.కె. ఫార్మసీ కళాశాల 'ఫార్మా-డీ' ఘటికోత్సవం




**తొలివెలుగు, ఎల్బీనగర్ :** ఫార్మా-డీ పూర్తి చేసుకున్న విద్యార్థులు నిరంతర అభ్యసనం, వృత్తి నైతికతను అలవర్చుకోవడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ అవకాశాలను అందుకోవచ్చని జేఎన్టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపల్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఎం. సునీతారెడ్డి అన్నారు. వనస్థలిపురంలోని పిస్తా హౌస్ వేదికగా శుక్రవారం కె.వి.కె. కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో 'ఫార్మా-డీ 2026' ఘటికోత్సవ (కాన్వకేషన్) వేడుక వైభవంగా జరిగింది. 2026 విద్యా సంవత్సరంలో కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ సందర్భంగా పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ సునీతారెడ్డి, ఏఐజీ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ. చిరంజీవిరావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధునిక వైద్య విధానంలో క్లినికల్ ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకమైనదని స్పష్టం చేశారు. రోగులకు సురక్షితమైన, నాణ్యమైన చికిత్స అందించడంలో వైద్యులతో సమానంగా వీరు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. క్లినికల్ ఫార్మసీ, ఔషధ భద్రత (ఫార్మకోవిజిలెన్స్), పరిశోధన రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.

**సమాజ శ్రేయస్సే ధ్యేయం కావాలి:**

కేఈఎస్ సొసైటీ కార్యదర్శి, కరస్పాండెంట్ సతీష్ కడియాల ముఖ్య పరిరక్షకులుగా వ్యవహరిస్తూ.. విద్యార్థులు తమ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేస్తూ కళాశాలకు, కన్నవారికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కేవలం సంపాదనకే పరిమితం కాకుండా సమాజ సేవను ధ్యేయంగా పెట్టుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సతీష్ చంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులు ఇక్కడితో ఆగిపోకుండా పరిశోధనల వైపు అడుగులు వేయాలన్నారు. అధ్యాపక బృందం సమన్వయంతో నిర్వహించిన ఈ వేడుకలో ప్రొఫెసర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని పట్టభద్రులను ఉత్సాహపరిచారు.

# అప్పులపై ఒక్కో మంత్రి ఒక్కో లెక్క!



- ఆ రూ.10వేల కోట్ల వ్యత్యాసం దేనికి సంకేతం?
- సీఎం చెప్పింది నిజమా.. మంత్రి మాటలు నిజమా?
- యాదాద్రి బోర్డులో నల్గొండకు చోటేది?: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**తొలివెలుగు, రామన్నపేట :** రాష్ట్ర ప్రభుత్వ అప్పుల లెక్కల్లో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయని, దీనిపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని నకిరేకల్ మాజీ శాసనసభ్యుడు చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు ఎఫ్ఆర్బీఎం పరిమితి కింద ప్రభుత్వం రూ.1,86,087 కోట్ల అప్పు తీసుకువచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతుంటే.. మంత్రి తనకు రాసిన లేఖలో మాత్రం రూ.1,77,058 కోట్లుగా పేర్కొన్నారని గుర్తుచేశారు. ఈ రెండు లెక్కల మధ్య ఉన్న దాదాపు రూ.10,000 కోట్ల వ్యత్యాసానికి కారణాలేమిటో బహిర్గతం చేయాలన్నారు.

**గోబెల్స్ ప్రచారం మానుకోవాలి:**

ఈ ఏడాది మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం 27 నెలల్లో రూ.3,47,294 కోట్ల అప్పు చేసిందని ప్రకటించారని, మరోవైపు మంత్రి జూపల్లి కృష్ణారావు వేరే లెక్కలు చెబుతున్నారని చిరుమర్తి విమర్శించారు. వీరిద్దరిలో ఎవరు చెప్పింది నిజమో తేలాలన్నారు. తాము గతంలో చేసిన సవాళ్ల నేపథ్యంలో ఇప్పుడు రాజీనామా చేయాల్సింది ఎవరో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.4 లక్షల కోట్లేనని తాము ఆధారాలతో నిరూపించామని, కాగ్ నివేదిక కూడా రూ.4.15 లక్షల కోట్లుగా పేర్కొంటూ తమ లెక్కలనే నిర్ధారించిందన్నారు. వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డులో ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఒక్కరికి కూడా స్థానం కల్పించకపోవడం అత్యంత విచారకరమని, ఇది జిల్లా ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

# కొరటికల్ – ఉప్పల్ ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం

- స్వయంగా నడిపి ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- ఎన్నికల హామీ నిలబెట్టుకున్నాం: ఎమ్మెల్యే

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మండల పరిధిలోని కొరటికల్ గ్రామం నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్ వరకు నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యుడు బీర్ల ఐలయ్య శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే స్వయంగా ఆర్టీసీ బస్సును నడుపుతూ సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చారు. కొరటికల్ గ్రామ ప్రజలు, విద్యార్థులు, మహిళల చిరకాల కోరికను నెరవేరుస్తూ ఈ బస్సును ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కొరటికల్ – ఉప్పల్ బస్సు సౌకర్యాన్ని కల్పించడం సంతోషంగా ఉందన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో నియోజకవర్గంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యత ఉంటుందని, గతంలో నష్టాల్లో ఉన్న సంస్థను సమర్థవంతమైన నిర్ణయాలతో లాభాల బాట పట్టించామన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారిపై ఆర్థిక భారం తగ్గిందని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ రహదారులపై ప్రజల అవసరాలకు అనుగుణంగా దశలవారీగా కొత్త సర్వీసులు ప్రవేశపెడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# 'డాన్‌బాస్కో'పై చర్యలు తీసుకోవాలి

- నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలోనే పుస్తకాల విక్రయాలు
- విద్యాధికారుల తీరుపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం
- జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు డిమాండ్

**తొలివెలుగు, రామన్నపేట:** నిబంధనలకు విరుద్ధంగా విద్యను వ్యాపారంగా మార్చి, పాఠశాల ప్రాంగణంలోనే పాఠ్యపుస్తకాలు, ఇతర విద్యా సామాగ్రిని విక్రయిస్తున్న డాన్ బాస్కో పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీకి అండగా నిలుస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

**విద్యా దోపిడీ.. అధికారుల లాలూచీ?:**

డాన్ బాస్కో పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేయడమే కాకుండా.. పాఠ్యపుస్తకాలను పాఠశాల లోపలే విక్రయిస్తుండగా తాము సాక్ష్యాలతో (రెడ్ హ్యాండెడ్ గా) పట్టుకున్నామని నాగరాజు తెలిపారు. దీనిపై స్థానిక మండల విద్యాధికారి (ఎంఈఓ)కి సమాచారం ఇస్తే.. రాజకీయ పలుకుబడికి లొంగిపోయి చూసిచూడనట్లు వ్యవహరించి వెళ్లిపోయారని విమర్శించారు. అనంతరం జిల్లా విద్యాధికారి (డీఈఓ) భిక్షపతికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా.. 'నేను వస్తున్నాను, అక్కడే ఉండండి' అని చెప్పి కాలయాపన చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. విద్యా వ్యవస్థను కాపాడాల్సిన అధికారులే ప్రైవేట్ యాజమాన్యాలతో లాలూచీపడి అవినీతికి పాల్పడటం దారుణమన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, నాయకులు తుర్కపల్లి లోకేష్, యాదాసు కార్తీక్, ముక్కిడి ప్రవీణ్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.







# పోచంపల్లి చేనేత సంఘం ఎన్నికల హోరు

- రెండో రోజు 9 నామినేషన్లు దాఖలు
- రంగంలోకి దిగిన ప్రధాన అభ్యర్థులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రతిష్ఠాత్మక చేనేత సహకార సంఘం ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు శుక్రవారం కొనసాగింది. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా వివిధ స్థానాలకు పోటీ చేయనున్న అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. ఎన్నికల అధికారి యూసఫ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం, రెండో రోజు మొత్తం 9 నామినేషన్లు అందాయి. అభ్యర్థులు తమ అనుచరులతో కలిసి ఎన్నికల కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. దీంతో చేనేత సంఘ ఎన్నికల్లో పోటీ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో కడవేరు చంద్రమౌళి, గంజి బసవలింగం, జోగు లక్ష్మీనారాయణ, సీత కృష్ణ, తుమ్మ లక్ష్మీనారాయణ, కర్నాటి ధనంజయ, సీత సత్యనారాయణ, గంజి బాబు తదితరులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు ఇంకా గడువు ఉండటంతో రానున్న రోజుల్లో మరికొంత మంది అభ్యర్థులు బరిలోకి దిగే అవకాశం ఉందని తెలుస్తోంది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ అనంతరం తుది పోటీదారుల జాబితా ఖరారు కానుంది. దీంతో పోచంపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికలపై సభ్యుల్లో ఆసక్తి నెలకొంది.

# ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- తప్పులు లేకుండా పత్రాల భర్తీ పూర్తి చేయాలి
- రాష్ట్ర ఎన్యూమరేషన్ పరిశీలకుడు రాంప్రసాద్
- భూదాన్ పోచంపల్లి, జలాల్‌పురంలో తనిఖీ





**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** ఓటర్ల నమోదు, సవరణల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎన్యూమరేషన్ (సర్వే) ప్రక్రియను అధికారులు సమర్థంగా, వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్యూమరేషన్ పరిశీలకుడు రాంప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంతో పాటు జలాల్‌పురం గ్రామంలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) రికార్డులను నమోదు చేస్తున్న విధానాన్ని, ప్రజల నుంచి వివరాల సేకరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఓటర్ల నమోదు, ఫారాల పూర్తిపై క్లుప్తంగా వివరించాలని, ఎక్కడా తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ విజయవంతం కావడంలో ప్రజల సహకారం ఎంతో కీలకమన్నారు. బీఎల్‌ఓలు పంపిణీ చేసిన పత్రాలను ఓటర్లు నిర్ణీత గడువులోగా తప్పుల్లేకుండా పూర్తి చేసి తిరిగి ఇవ్వాలని కోరారు. తద్వారా అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ నాగేశ్వరరావు, ఆర్ఐ సుధాకర్‌రావు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

# 'ట్రినిటీ' హైస్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

- అనుమతులు లేకుండా బ్రాంచ్‌ల నిర్వహణ
- డీఈఓకు సామాజిక ఉద్యమకారుడు లింగస్వామి వినతి



**తొలివెలుగు, చౌటుప్పల్/భువనగిరి :** ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చౌటుప్పల్ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా బ్రాంచ్‌లను నడిపిస్తున్న ట్రినిటీ హైస్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సామాజిక ఉద్యమకారుడు కట్టెల లింగస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం లింగస్వామి మాట్లాడుతూ.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రినిటీ హైస్కూల్ యాజమాన్యం కేవలం ఒకే ఒక్క భవనానికి అనుమతి తీసుకుని, దానికి విరుద్ధంగా పట్టణంలో నాలుగు వేరు వేరు బ్రాంచ్‌లను నడిపిస్తోందని ఆరోపించారు. ఆయా అదనపు భవనాలకు గానీ, కొత్త బ్రాంచ్‌ల ఏర్పాటుకు గానీ విద్యాశాఖ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోలేదన్నారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా విద్యా వ్యాపారం సాగిస్తున్న ట్రినిటీ పాఠశాల యాజమాన్యంపై, ప్రిన్సిపల్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకొని, సదరు బ్రాంచ్‌లను సీజ్ చేయాలని ఆయన అధికారులను కోరారు.

# భగ్గుమన్న ప్లైవుడ్ ఫ్యాక్టరీ!



- ఐదు గంటల పాటు అగ్నికీలలు.. దట్టమైన పొగలు
- తప్పిన ప్రాణాపాయం.. భారీగా ఆస్తి నష్టం
- మూడు నెలల్లో రెండో అగ్నిప్రమాదం.. కారణాలపై దర్యాప్తు ప్రారంభం

**తొలివెలుగు, చౌటుప్పల్/భూదాన్ పోచంపల్లి :** మండలంలోని నారాయణగిరి రెవెన్యూ పరిధిలో ఉన్న 'జాబు వాణి ఆగ్రో టెక్' ప్లైవుడ్ పరిశ్రమలో శుక్రవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, ఫ్యాక్టరీలో నిల్వ ఉంచిన చెక్క సామగ్రి, ఇతర ముడి పదార్థాల కారణంగా వేగంగా వ్యాపించాయి. దీంతో పరిశ్రమ ప్రాంగణం అంతా దట్టమైన పొగలు, అగ్నికీలలతో కమ్ముకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది భువనగిరి, చౌటుప్పల్‌తో పాటు హయాత్‌నగర్ నుంచి ఫైర్ ఇంజన్లతో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. సుమారు ఐదు గంటలపాటు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది.

**కార్మికులు లేకపోవడంతో తప్పిన ప్రమాదం:**

అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో పరిశ్రమలో కార్మికులు విధుల్లో లేకపోవడంతో ప్రాణనష్టం తప్పినట్లు సమాచారం. అదే సమయంలో కార్మికులు విధుల్లో ఉండి ఉంటే పరిస్థితి మరింత విషమంగా మారేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదంలో పరిశ్రమలోని యంత్రాలు, ముడి సరుకు, ఇతర సామగ్రికి భారీ నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.



**కారణాలపై పలు అనుమానాలు:**

ఈ పరిశ్రమ యాజమాన్యానికి చెందిన మరో యూనిట్‌లో కూడా మూడు నెలల క్రితం అగ్నిప్రమాదం జరిగినట్లు స్థానికులు గుర్తు చేస్తున్నారు. వరుసగా అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడంతో ప్రమాదానికి గల కారణాలపై వివిధ కోణాల్లో చర్చ జరుగుతోంది. అయితే ప్రమాదానికి గల అసలు కారణాలు అధికారిక దర్యాప్తు అనంతరమే తేలనున్నాయి. ఘటన స్థలాన్ని ఎస్ఐ భాస్కర్ రెడ్డి పరిశీలించి వివరాలు సేకరించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అధికారుల దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రమాదానికి గల కారణాలపై అధికారిక నిర్ధారణ వెలువడాల్సి ఉంది.

# మా స్టేజీ వద్ద బస్సులు ఆపండి మహాప్రభో..!'

- మా స్టేజీ వద్ద బస్సులు ఆపండి మహాప్రభో..!
- రహీంఖాన్‌పేటలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా
- అన్ని డిపోల బస్సులు నిలపాలని డిమాండ్
- ఎస్ఐ హామీతో ఆందోళన విరమణ

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** మండల పరిధిలోని రహీంఖాన్‌పేట స్టేజీ వద్ద అన్ని రకాల ఆర్టీసీ బస్సులను నిలపాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పది గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ప్రయాణికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. కూరెళ్ల, రాఘవాపురం, పుల్లాయిగూడెం, రాగిబావి, తుక్కాపురం, పోతిరెడ్డిపల్లి, ఉప్పలపాడు, మోదుబావిగూడెం, రేపాక, కప్రాయిపల్లి, రహీంఖాన్‌పేట తదితర గ్రామాల ప్రజలకు రహీంఖాన్‌పేట స్టేజీ ప్రధాన రవాణా కేంద్రంగా ఉందన్నారు. అయితే ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇక్కడ ఆగకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు డిపో మేనేజర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేకపోయిందని విమర్శించారు. కరోనా కాలానికి ముందు నడిచిన అన్ని బస్సు సర్వీసులను పునరుద్ధరించి, యథావిధిగా నడపాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ఎస్ఐ లక్ష్మీనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని వివిధ డిపోల మేనేజర్లతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల ముత్యాలు, పాశికంటి లక్ష్మీనరసయ్య, మారుపాక వెంకటేష్, నయీమ్, కూరెళ్ల మచ్చగిరితో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు సుధగాని కళావతి–లింగయ్య, గడ్డం ముత్తమ్మ, సంగపాక శ్రీవాణి–మహేష్, ఘనగాని మాధవి–మల్లేష్, నరుముల రామలింగయ్య, ఎరుకల యతీశ్వర్ గౌడ్, గడ్డం అశోక్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కలువల నరసయ్య, మారుపాక అంజయ్య, జక్క దయాకర్ తదితరులు, వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు.



# లాభాలపైనే ఆరాటం.. వసతులపై లేదు నిబద్ధత!

- పెట్రోల్ బంకులో మృగ్యమైన కనీస సౌకర్యాలు
- పనిచేయని గాలి యంత్రాలు.. అధ్వానంగా టాయిలెట్లు
- నిబంధనల అమలుపై అధికారుల పర్యవేక్షణ కరువు

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** మండల కేంద్రంలోని రాయగిరి – మోత్కూర్ ప్రధాన రహదారిపై ఉన్న ఓ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో వినియోగదారులకు కల్పించాల్సిన కనీస మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాల్సిన పలు సౌకర్యాలు లేకపోవడం లేదా సరిగా పనిచేయకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాహనాలకు ఉచితంగా గాలి నింపేందుకు ఏర్పాటు చేయాల్సిన ఎయిర్ ఫిల్లింగ్ యంత్రం పనిచేయడం లేదని, గాలి నింపాలని కోరితే యంత్రం మరమ్మతులో ఉందంటూ సిబ్బంది సమాధానం ఇస్తున్నారని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు. అలాగే, వినియోగదారుల కోసం అందుబాటులో ఉండాల్సిన ప్రథమ చికిత్స కిట్ కనిపించడం లేదని, ఇంధన నాణ్యతను పరీక్షించేందుకు అవసరమైన సదుపాయాలు కూడా స్పష్టంగా అందుబాటులో లేవని కొందరు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. తాగునీటి సౌకర్యం తగిన స్థాయిలో లేకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. వినియోగదారుల సౌకర్యాలపై సంబంధిత శాఖలు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, పర్యవేక్షణ లోపిస్తున్నట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. దీంతో నిబంధనల అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని వారు పేర్కొంటున్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు స్పందించి, పెట్రోల్ బంకులో ఉన్న వసతులను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.









# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే వర్తింపజేయాలని ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో స్వాగత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం లేకపోవడంతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఆకలితోనే తరగతులకు హాజరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల తరహాలోనే జూనియర్ కళాశాలల్లోనూ పోషకాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించాలన్నారు. కళాశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని.. స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సరిపడా ఫ్యాన్లు, ఫర్నిచర్ వంటి మౌలిక వసతులను కల్పించడంతో పాటు తరగతి గదులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అరవింద్, మండల ఉపాధ్యక్షుడు ఇరిగి వరుణ్ తేజ్, నాయకులు పి. మల్లేష్, లక్ష్మీ ప్రసన్న, మాధురి, శివకుమార్, సిద్ధు, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: ఇ.ఎల్.వి. ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్



**తొలివెలుగు, చౌటుప్పల్:** మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి తమ వంతు శాయశక్తులా కృషి చేస్తామని ఇ.ఎల్.వి. ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ పేర్కొన్నారు. గ్రామంలోని తాగునీటి ఇబ్బందులపై సమాచారం అందుకున్న ఆయన శుక్రవారం అక్కడ పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని అయ్యప్ప స్వామి సన్నిధానం సమీపంలో ఉన్న బోరు బావి నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వెనుక వైపు ఉన్న నీటి ట్యాంకుకు పైప్‌లైన్ కనెక్షన్ లేకపోవడం వల్లే తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఆయన గుర్తించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం, ఉప సర్పంచ్ ముద్దం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అందడమే ధ్యేయం





- ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్
- రెడ్డిబావిలో ఘన స్వాగతం.. త్వరలోనే సీసీ కెమెరాలు, టైలరింగ్ కేంద్రం ఏర్పాటు

**తొలివెలుగు, చౌటుప్పల్:** సమాజంలో ప్రతి ఒక్కరికీ కనీస అవసరాలైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు దక్కాలన్నదే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రెడ్డిబావి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామ సర్పంచ్ నందగిరి వెంకటేష్.. భాస్కర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇరుగదిండ్ల భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజల సంక్షేమం కోసమే తమ ఫౌండేషన్ నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. రెడ్డిబావి గ్రామంలో భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం త్వరలోనే సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తామని, శిక్షణ అనంతరం వారు స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సాహం అందిస్తామన్నారు.

**కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పులపాలు కావొద్దు:**

సాధారణ ప్రజలు అనారోగ్యం బారిన పడితే కంగారుపడి కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేస్తూ అప్పులపాలు కావొద్దని భాస్కర్ సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు తమ ఫౌండేషన్ ను సంప్రదిస్తే, మెరుగైన ఉచిత/సహాయక వైద్య సేవలు అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో ఏవైనా మౌలిక వసతుల సమస్యలు ఉంటే స్థానిక యువత, పెద్దలు తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ఫౌండేషన్ తరపున శాయశక్తులా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# మదర్ డైరీ పాడి రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు

- మూడు రోజుల్లో బకాయి బిల్లుల చెల్లింపు
- మూతపడిన మూడు పాల సొసైటీల పునరుద్ధరణ
- డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్, డీజీఎం శివకుమార్



**తొలివెలుగు, రాజాపేట:** మదర్ డైరీ పాడి రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్, డీజీఎం శివకుమార్ వెల్లడించారు. మండల పరిధిలోని నర్సాపురం, రేణికుంట, బొందుగుల, సింగారం గ్రామాల్లోని పాల సొసైటీలను శుక్రవారం వారు ఆకస్మికంగా సందర్శించారు. పలు కారణాలతో మూతపడిన బొందుగుల పున్నమి, కొత్తజాల, బూరుగుపల్లి పాల సొసైటీలను రైతులతో మాట్లాడి తిరిగి ప్రారంభించారు. రాజాపేట, బొందుగుల బల్క్ మిల్క్ చిల్లింగ్ (ఎమ్సీసీ) కేంద్రాలను తనిఖీ చేసి, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు కేవలం రెండు నెలల బిల్లులు మాత్రమే బకాయి ఉన్నాయని, వాటిని మరో మూడు రోజుల్లో చెల్లిస్తామని తెలిపారు. ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి క్రమంతప్పకుండా బిల్లులు అందుతాయన్నారు. త్వరలోనే రైతులకు నేరుగా ఖాతాల్లోకే నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, చిల్లింగ్ సెంటర్లలో డిజిటల్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు రోజుకు 50 లీటర్ల కంటే ఎక్కువ పాలు పోసే రైతులకు లీటరుకు 50 పైసలు, 100 లీటర్లకు పైగా పోసే వారికి లీటరుకు రూపాయి చొప్పున అదనంగా చెల్లించనున్నట్లు వివరించారు. త్వరలోనే సబ్సిడీపై మందులు, దానాతో పాటు బీమా సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రైవేట్ డైరీల వైపు వెళ్లిన రైతులు తిరిగి మదర్ డైరీకి పాలు పోసేందుకు సుముఖత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాసులు, మేనేజర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను కలిసిన మోత్కుపల్లి బాలకృష్ణ

- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సూచన



**తొలివెలుగు, రాజాపేట:** హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ మోత్కుపల్లి బాలకృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ తాజా పరిస్థితులు, సంస్థాగత బలోపేతంపై వారరు చర్చించారు. రానున్న రోజుల్లో పార్టీ చేపట్టబోయే వివిధ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా బాలకృష్ణకు కేటీఆర్ సూచించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ.. అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆలేరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# గీత కార్మిక కుటుంబానికి 'కానా' ఆసరా

- అశోక్ గౌడ్ భార్యకు కుట్టు మిషన్ అందజేత



**తొలివెలుగు, రాజాపేట:** ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన గీత కార్మిక కుటుంబానికి అమెరికాకు చెందిన కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (కానా) సంస్థ అండగా నిలిచింది. మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు తులసి అశోక్ గౌడ్ ఇటీవల కులవృత్తి చేసుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు చేసిన విజ్ఞప్తికి కానా సంస్థ స్పందించింది. సంస్థ ప్రతినిధులు నాతి గణేష్, బాల్న రామచంద్రుడు సహకారంతో మృతుడి భార్య లక్ష్మికి శుక్రవారం ఉపాధి నిమిత్తం కుట్టు మిషన్‌ను అందజేశారు. కేజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు, స్థానిక గీత సొసైటీ అధ్యక్షుడు బాహుపేట వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జయరాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో తాటి కార్పొరేషన్ నుంచి అందాల్సిన తక్షణ సాయం నిలిచిపోయిన తరుణంలో, అమెరికాలో ఉంటూ గీత కార్మిక కుటుంబాలకు కానా సంస్థ భరోసా కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు నేమిలే మహేందర్, మండల అధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్, మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి, మాజీ జెడ్పీటీసీ జెల్ల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# చేనేత సంఘం ఎన్నికల కోలాహలం

- భారీగా తరలివచ్చి నామినేషన్లు వేసిన 'శ్రీ భావనాఋషి భద్రావతి దేవి' ప్యానెల్ అభ్యర్థులు

తొలివెలుగు, చౌటుప్పల్: చౌటుప్పల్ చేనేత సహకార సంఘం ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. ఎన్నికల్లో భాగంగా శుక్రవారం 'శ్రీ భావనాఋషి భద్రావతి దేవి' ప్యానల్ అభ్యర్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు దాఖలు చేశారు. అభ్యర్థులుగా గోశిక రవి, కందగట్ల విఠల్, గుర్రం నరసింహ, గోశిక పురుషోత్తం, గోశిక నరసింహ, గోశిక మురళి, గోశిక భాస్కర్, గుర్రం సత్తమ్మ, కోనం వినోద, గుర్రం నరసింహ, వనం పాండు తదితరులు నామినేషన్లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోశిక స్వామి, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్, మాజీ ఉపాధ్యక్షుడు గోశిక వెంకటేశం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా శ్రీ భావనాఋషి భద్రావతి దేవి ప్యానెల్ బరిలోకి దిగుతోందని, సంఘం సభ్యులందరూ ఈ ప్యానెల్‌ను ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ నామినేషన్ల పర్వంలో ప్రము నాయకులు గోశిక అంజయ్య, గజం ధనంజయ, గోశిక బిక్షపతి, వనం ధనంజయ, తడక భీమయ్య, ఒడిచర్ల రాజయ్య, సుంకి రవి, కందగట్ల మధుసూదన్, గోశిక జగన్, తడక దామోదర్, బాలరాజు, గోషిక నరహరి, మహిళా నేతలు గోశిక నీరజ, గోశిక అనిత, తడక సురేఖ, గోశిక హైమావతి, నోముల శారదాంబలతో పాటు చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభ్యర్థుల రాకతో సంఘం కార్యాలయ ప్రాంగణం కోలాహలంగా మారింది.

# బాలాజీ పవర్‌లూమ్స్ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

- అధ్యక్షుడిగా బూరెల స్వామి, ఉపాధ్యక్షుడిగా బొద్దుల వెంకటేశం



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని రఘునాథపురం బాలాజీ పవర్‌లూమ్స్ వివర్స్ కో-ఆపరేటివ్ అండ్ సేల్స్ సొసైటీ లిమిటెడ్ కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికల అధికారిగా మీర్ ఇబ్రహీం అలీ వ్యవహరించారు. సొసైటీ నూతన అధ్యక్షుడిగా బూరెల స్వామి, ఉపాధ్యక్షుడిగా బొద్దుల వెంకటేశం, సెక్రటరీగా సామల భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారి ప్రకటించారు. అలాగే డైరెక్టర్లుగా బల్ల నరహరి, చేన్న నర్సింహులు, ఎలగందుల ప్రకాష్, సకినాల విష్ణు, గుర్రం సతీష్, బల్ల సుదర్శన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బూరెల స్వామి మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన సొసైటీ సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## గణేష్‌నగర్‌లో భూగర్భ మురుగునీటి పనులకు శంకుస్థాపన

- వార్డుల సమగ్ర అభివృద్ధే ధ్యేయం: మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని 14వ వార్డు గణేష్ నగర్ కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్య పరిష్కారానికి గాను.. శుక్రవారం ఆమె నూతన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (భూగర్భ మురుగునీటి పారుదల) పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్‌తో కలిసి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. కాలనీల సమగ్ర అభివృద్ధికి, ప్రజల ఆరోగ్య రక్షణకు నాణ్యమైన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ఎంతో అవసరమన్నారు. పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించి, నిర్దేశిత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి, 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమా మహేశ్వరి సాయిలు, 16వ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాస్, కో-ఆప్షన్ సభ్యురాలు సందగల్ల విజయ సతీష్, పస్తం గంగారాములు, వర్కాల రవి, కామిశెట్టి చంద్రశేఖర్, ఊడుగు వెంకటేష్, చెరుకు రాజు, శివకుమార్ చారి, బాబా, గుత్తా ధనలక్ష్మి, తండా లక్ష్మమ్మ, పందుల విజయ తదితరులు పాల్గొని పనులు ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా 'బేటీ జన్మోత్సవం'

- ఆడ శిశువు, తల్లికి ప్రోత్సాహకాలు అందజేత
- ఆడపిల్లలపై సానుకూల దృక్పథం పెరగాలి: సూపర్‌వైజర్ పద్మ



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి/భువనగిరి:** కేంద్ర ప్రభుత్వ 'బేటీ బచావో బేటీ పడావో' (బీబీబీపీ) పథకంలో భాగంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బేటీ జన్మోత్సవం' కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళా సాధికారత కేంద్రం సౌజన్యంతో భువనగిరిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ వేడుకల్లో.. నూతనంగా జన్మించిన ఆడ శిశువుకు గౌను, తల్లికి చీరను ప్రోత్సాహకంగా అందజేశారు. పోచంపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ ముఖ్య అతిథిగా హాజరై వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పద్మ మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. బాలల సంక్షేమం, రక్షణ, వారి సమగ్ర అభివృద్ధిపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆడపిల్లలను ఉన్నతంగా చదివించి, సమాజంలో వారి సాధికారతకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధి పి.నిఖిత, పోచంపల్లి మండల అంగన్‌వాడీ టీచర్లు మంగ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలి

- అంకిరెడ్డిగూడెంలో తహసీల్దార్ వీరాభాయ్ తనిఖీ
- నేడు ఓటరు పత్రాల ఆన్‌లైన్ ప్రక్రియ: సర్పంచ్ మల్లేష్ గౌడ్




**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ఓటరు నమోదు కార్యక్రమం చౌటుప్పల్ మండలంలో ముమ్మరంగా సాగుతోంది. అంకిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చేపట్టిన ఓటరు నమోదు పత్రాల స్వీకరణను చౌటుప్పల్ తహసీల్దార్ వీరాభాయ్ పరిశీలించారు. సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో, ఓటరు నమోదు ఇన్‌ఛార్జ్, మండల సర్వేయర్ ఎం. మురళీధరన్ పర్యవేక్షణలో అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఓటర్ల నమోదు సరళిని తహసీల్దార్ స్వయంగా అడిగి తెలుసుకుని, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామంలో శుక్రవారం సేకరించిన ఓటరు నమోదు ఫారాలను శనివారం ఉదయం 9 గంటల నుండి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు ఆన్‌లైన్ చేయనున్నారు. ఓటు హక్కు లేని వారు తమ సంబంధిత పత్రాలు, కుటుంబ వివరాలతో నేరుగా జీపీ కార్యాలయానికి వచ్చి ఓటు నమోదు చేసుకోవాలని సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీపీఓ రాములు, శైలజ, నరసింహ, దశరథ్, బీఎల్ఓ బొల్లు అండాలు, అంగన్‌వాడీ టీచర్ నల్ల జయప్రద, గ్రామ యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా 'పీసీఆర్ ఫౌండేషన్'

- చెరుకుగూడెంలో ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ
- ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్




**తొలివెలుగు, జన్నారం:** గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పలువురు కొనియాడారు. మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలో గల చెరుకుగూడెం ప్రైమరీ స్కూల్, అంగన్వాడీ కేంద్రంలో పీసీఆర్ (పూర్ణచంద్రావు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అండగా నిలవాలన్నదే తమ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగానే సుమారు 20 మంది చిన్నారులకు ఈ బ్యాగులను అందజేశామని, భవిష్యత్తులోనూ విద్యాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పొనకల్ వార్డు సభ్యుడు చెరుకు రాజ్ కుమార్, పీసీఆర్ ఫౌండేషన్ సభ్యుడు చింతల సతీష్, ఉపాధ్యాయులు రాజశేఖర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# రెండోరోజూ నష్టాల్లో సూచీలు



ముంబై, జూన్ 30 : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిశాయి. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పలు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతోపాటు అమెరికా-ఇరాన్ దేశాల మధ్య జరిగే చర్చలపై అనిశ్చితి నెలకొనడం మదుపరుల్లో సెంటిమెంట్‌ను నీరుగార్చింది. ఒక దశలో 400 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 249.70 పాయింట్లు కోల్పోయి 76,478.67 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 80.50 పాయింట్లు కోల్పోయి 23,865.75 వద్ద స్థిరపడింది. దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం, బ్లూచిప్ సంస్థల షేర్లు కుప్పకూలడం మార్కెట్లో సెంటిమెంట్‌ను నీరుగార్చిందని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. సూచీల్లో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టెక్ మహీంద్రా, ఐటీసీ, హెచ్‌యూఎల్ షేర్లు భారీగా నష్టపోయాయి. కానీ, మారుతి, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు దిద్దుబాటునకు గురయ్యాయని, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన మిశ్రమ ట్రెండింగ్‌ను మరింత నష్టాల్లోకి నెట్టాయని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రంగాలవారీగా ఐటీ సూచీ అత్యధికంగా 2.62 శాతం నష్టపోగా, పీఎస్‌యూ బ్యాంకింగ్, మెటల్, యుటిలిటీ, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగ సూచీ నష్టాల్లోకి జారుకున్నాయి. కానీ, రియల్టీ, సర్వీసెస్, కన్జ్యూమర్ డ్యూరబుల్, హెల్త్‌కేర్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్ రంగ సూచీలు లాభాల్లోకి వచ్చాయి.



## టాటా సియారా ఈవీ.. ప్రారంభ ధర రూ.18.79 లక్షలు

న్యూఢిల్లీ, జూన్ 30 : ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ దేశీయ మార్కెట్‌కు మరో ఈవీ మాడల్‌ను తీసుకొచ్చింది. సియారీ ఈవీ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ రు ప్రారంభ ధరను రూ.18.79 లక్షలుగా నిర్ణయించిన సంస్థ..గరిష్ఠంగా రూ.24.79 లక్షలుగా నిర్ణయించింది. బుకింగ్‌లు ప్రారంభించిన సంస్థ..జూలై 15 నుంచి డెలివరీ చేయనున్నట్టు ప్రకటించింది. కేవలం 5.8 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. 75 కిలోవాట్ల బ్యాటరీ సింగిల్ చార్జింగ్‌తో 665 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. అలాగే 63 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ 565 కిలోమీటర్లకు పైగా మైలేజీ ఇవ్వనున్నది. కారుతోటే యూపీఐ చెల్లింపులు జరుపడంతోపాటు ఎయిర్‌కన్సోల్ గేమింగ్, ఈవీ రూట్ ప్లాన్ కూడా చేసుకోవచ్చునని తెలిపింది.

## వెండి పరుగులు

న్యూఢిల్లీ, జూన్ 30 : గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పుంజుకున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.6 వేలు ఎగబాకి రూ.2.30 లక్షలకు చేరుకున్నది. కానీ, బంగారం ధరలు మరింత తగ్గాయి. డిమాండ్ పడిపోవంతో న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.800 తగ్గి రూ.1,45,800కి పడిపోయింది. అంతకుముందు ఇది రూ.1,46,600 గా ఉన్నట్టు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది.




# ప్రిక్వార్టర్స్‌కు పోర్చు గోల్



టొరంటో: తన అద్భుత కెరీర్‌లో లోటుగా ఉన్న ఫిఫా ప్రపంచకప్‌ను సాధించే చివరి ప్రయత్నంలో ఉన్న పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో అందుకు మరో అడుగు ముందుకేశాడు. తన ఫామ్‌ను కొనసాగిస్తూ పెనాల్టీ కిక్‌కు రొనాల్డో చేసిన గోల్.. ఆ జట్టు మరో స్టార్ ప్లేయర్ గొంకాలో రామోస్ హెడర్.. ఆఖర్లో క్రొయేషియా చేసిన గోల్ ఆఫ్‌సైడ్‌గా తేలడం పోర్చుగల్‌ను ప్రిక్వార్టర్ ఫైనల్ చేర్చాయి. గురువారం అర్ధరాత్రి ఉత్కంఠగా జరిగిన రౌండ్ ఆఫ్ -32 మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో క్రొయేషియాను ఓడించి ముందంజ వేసింది. ఫలితంగా 41 ఏండ్ల రొనాల్డో తన ఆరో వరల్డ్‌కప్‌లో మరో మ్యాచ్ ఆడేందుకు సిద్ధమవగా.. అనూహ్య పరాజయంతో క్రొయేషియా దిగ్గజం లూకా మోడ్రిచ్ తన ఐదో ఫిఫా టోర్నీని కన్నీళ్లతో ముగించాడు. ఈ హోరాహోరీ పోరులో ఇవాన్ పెరిసిచ్ 53వ నిమిషంలో గోల్ కొట్టి క్రొయేషియాకు తొలి ఆధిక్యం అందించగా.. 68వ నిమిషంలో లభించిన పెనాల్టీ కిక్‌ను రొనాల్డో గోల్‌గా మలిచాడు. వరల్డ్‌కప్ నాకౌట్ రౌండ్‌లో తనకు ఇదే తొలి గోల్ కావడం విశేషం. ఇంజూరీ టైమ్‌లో 90౦4వ నిమిషంలో రామోస్ పోర్చుగల్‌కు విన్నింగ్ గోల్ అందించాడు. సోమవారం జరిగే ప్రిక్వార్టర్స్‌లో స్పెయిన్‌తో పోర్చుగల్ తలపడనుంది.

### హోరాహోరీ పోరు

గత రెండు వరల్డ్‌కప్స్‌లో ఫైనల్, సెమీఫైనల్ ఆడిన క్రొయేషియా... పోర్చుగల్‌తో నువ్వానేనా అన్నట్టు తలపడింది. ఆట ఆరంభం నుంచే ఇరు జట్లూ బంతిపై పట్టు సాధించేందుకు ప్రయత్నించాయి. కానీ, ఫస్టాఫ్‌లో గోల్ కొట్టలేకపోయాయి. విరామం తర్వాత క్రొయేషియా గేరు మార్చింది. నికోలా వ్లావిచ్, స్టానిసిచ్ రైట్ ఫ్లాంక్ నుంచి ఇచ్చిన క్రాస్‌ను పెరిసిచ్ నెట్‌లోకి పంపడంతో ఆ జట్టు1-0తో నిలిచింది. ఇక్కడి నుంచి క్రొయేషియన్లు మరిన్ని దాడులు చేసినా.. పోర్చుగల్ గోల్ కీపర్ డియోగో కోస్టా ప్రత్యర్థులను సమర్థవంతంగా నిలువరించాడు. కోస్టాను బోల్తా కొట్టిస్తూ పీటర్ సుకిచ్ బంతిని నెట్‌లోకి పంపించినా రిఫరీ దాన్ని ఆఫ్‌సైడ్‌గా తేల్చాడు. ఈ దశలో వ్లాసిచ్ పోర్చుగల్ ఆటగాడు రెనటో వీగాను బాక్స్‌లో కిందపడేయడంతో వార్ (వీడియో అసిస్టెంట్ రిఫరీ) రివ్యూ తర్వాత రిఫరీ పెనాల్టీ ఇచ్చాడు. దీన్ని సద్వినియోగం చేసుకున్న రొనాల్డో కూల్‌గా గోల్ చేసి స్కోరు సమం చేశాడు. ఇక్కడి నుంచి క్రొయేషియా ఫార్వర్డ్స్ వరుస దాడులు చేశారు. కొన్నింటిని కోస్టా అడ్డుకోగా.. 80వ నిమిషంలో పీటర్ సుకిచ్ చేసిన గోల్‌ను రిఫరీ ఆఫ్‌సైడ్‌గా తేల్చాడు. నిర్ణీత సమయంలో ఇరు జట్లూ 1-1తో నిలవగా.. ఇంజూరీ టైమ్‌లో పోర్చుగల్ మళ్లీ జోరు పెంచింది. 94వ నిమిషంలో లియో అందించిన క్రాస్‌ను రమోస్ హెడర్‌తో నెట్‌లోకి కొట్టి 2-1తో ఆధిక్యం అందించడంతో గెలుపు ఖాయం అనుకొని ఆ జట్టు ఆటగాళ్లంతా సంబరాల్లో మునిగిపోయారు. ఆటలో అసలు డ్రామా చివరి నిమిషాల్లోనే మొదలైంది. రామోస్ గోల్ చేసిన కాసేపటికే 103వ నిమిషంలో పోర్చుగల్ బాక్స్‌లో మరియో పసాలిచ్ అందించిన పాస్‌ను జొస్కో గ్వర్డియోల్ నెట్‌లోకి పంపడంతో స్కోరు 2-2తో సమం అయింది. రొనాల్డో ముఖంలో నిరాశ కనిపించగా.. క్రొయేషియా ఆటగాళ్లు, స్టేడియంలోని ఆ జట్టు అభిమానులంతా పూనకాలు వచ్చినట్టు ఊగిపోయారు. కానీ, క్షణాల్లోనే వారి ఆనందం ఆవిరైంది.రెండున్నర నిమిషాల వార్ రివ్యూ తర్వాత పసాలిచ్ ఆఫ్‌సైడ్ పొజిషన్‌లో ఉన్నట్టు గుర్తించిన రిఫరీ ఈ గోల్‌ను రద్దు చేశాడు. ఆ జట్టు ప్లేయర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేయగా.. భారీ సంఖ్యలో క్రొయేషియా ఫ్యాన్స్ గ్రౌండ్‌లోకి వాటర్ బాటిళ్లను విసిరేయడంతో ఆటకు కాసేపు ఆటంకం కలిగింది. తిరిగి మొదలయ్యాక చివరి నిమిషాల్లో ఆధిక్యాన్ని కాపాడుకున్న రొనాల్డోసేన ప్రిక్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. వార్ సమీక్ష క్రొయేషియాకు గుండెకోత మిగల్చడం ఇదే తొలిసారి కాదు. 2018 ఫైనల్లోనూ 'వార్' ఆ జట్టును దెబ్బకొట్టింది. నాడు ఫ్రాన్స్‌తో ఫైనల్లో ఇవాన్ పెరిసిచ్ బంతిని చేతితో తాకాడని వార్ సమీక్ష తర్వాత రిఫరీ 38వ నిమిషంలో ఫ్రాన్స్‌కు స్పాట్ కిక్ ఇవ్వడం అత్యంత వివాదాస్పద పెనాల్టీ నిర్ణయం అయింది.

